సాక్షి తిరుపతి

శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



జాగ్రత్తలే వడదెబ్బకు నివారణ

విపరీతమైన ఎండల నేపథ్యంలో జాగ్రత్తలు పాటిస్తే వడదెబ్బ తగలదని డీఎంహెచ్‌ఓ శ్రీహరి తెలిపారు.

- IIలో



వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు

జిల్లాలో వైఎస్సార్‌సీపీ దూకుడు పెంచింది. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా దూసుకుపోతోంది.

- IIలో



తాగుబోతుల వీరంగం

ఏర్పేడు మండలం, కందాడ ప్రాథమిక పాఠశాలలో తాగుబోతులు వీరంగం సృష్టించినట్టు హెచ్‌ఎం తెలిపారు.

- IIలో

న్యూస్‌రీల్

గవర్నర్‌కు సాదర స్వాగతం



రేణిగుంటలో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

రేణిగుంట: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు గురువారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ దన్కర్ ఈనెల 26న తిరుపతికి రానున్న నేపథ్యంలో ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. గవర్నర్‌కు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయల్దేరి వెళ్లారు.

మే 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

– ఫీజు చెల్లింపునకు 30 వరకు గడువు పెంపు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగుతాయని ఆర్‌ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు పరీక్షలుంటాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 24న సెకండ్ లాంగ్వేజ్, 25న ఇంగ్లిష్, 27న మ్యాథ్స్–1ఏ, 2ఏ, బోటనీ, సివిక్స్, 28న మ్యాథ్స్–1బీ, 2బీ, జువాలజీ, హిస్టరీ, 29న ఫిజిక్స్, ఎకనామిక్స్, 30న కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్, 31న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్(బీపీసీ విద్యార్థులకు), జూన్ 1న మోడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ సబ్జెక్టుల్లో పరీక్షలుంటాయని తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లించడానికి అలాగే రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌లకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 30వ తేదీ వరకు ఇంటర్ బోర్డు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. అలాగే ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జూన్ 6న, 7వ తేదీ పర్యావరణ విద్య పరీక్షలను ఆయా తేదీల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతాయని వెల్లడించారు. ప్రాక్టికల్స్ పరీక్షలు మే 1నుంచి 4వ తేదీ వరకు రోజూ ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు నామినేషన్ల పరిశీలన

తిరుపతి అర్బన్: నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసిన నేపథ్యంలో శుక్రవారం పరిశీలన ఉంటుందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆ మేరకు ఆయన గురువారం రాత్రి కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గానికి, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్వోలను ఆదేశించారు. సమావేశంలో ఈఆర్వోలు, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు

తిరుపతి అర్బన్: ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సార్వత్రిక ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుల సెల్ నంబర్లను యంత్రాంగం ప్రకటించిందన్నారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని సర్వేపల్లి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు కరీగౌడ(ఐఏఎస్) సెల్ నం.9912340472కు, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు ఉజ్వల్‌కుమార్ ఘోష్ సెల్ నం.07569909928కు, , చిత్తూరు పార్లమెంటరీ పరిధిలోని చంద్రగిరి, నగరి, జీడీనెల్లూరుకు కైలాస్ వాంఖడే(ఐఏఎస్) సెల్ నం. (09281448305కు తెలియజేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

chandragiri rally

చంద్రగిరి నుంచి కొనసాగిన ర్యాలీలో పార్టీశ్రేణులు, అభిమానులు (ఇన్‌సెట్) ర్యాలీలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మంత్రి రోజా, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్





ర్యాలీ ముందు కళాభిమానం

చంద్రగిరిలో ఎగసిన అభిమాన కెరటం

జిల్లాలో నామినేషన్ల ఘట్టం గురువారం అట్టహాసంగా ముగిసింది. తిరుపతి పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 399 నామినేషన్లు దాఖలయ్యాయి. తిరుపతి పార్లమెంట్‌కు 48 నామినేషన్లు, జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 351 నామినేషన్లు వచ్చాయి. చంద్రగిరి అసెంబ్లీకి అత్యధికంగా 97 నామినేషన్లు, సూళ్లూరుపేటకు అత్యల్పంగా 30 నామినేషన్లు పడ్డాయి. గురువారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు మోహిత్, మేరిగ మురళీధర్, కిలివేటి సంజీవయ్య భారీ జనసందోహం నడుమ నామినేషన్లు వేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన, తర్వాత ఈనెల 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను చేపట్టనున్నారు. – తిరుపతి అర్బన్

- అట్టహాసంగా ముగిసిన నామినేషన్ల పర్వం
- వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లకు పోటెత్తిన జనం

చంద్రగిరి/తిరుపతి రూరల్: చంద్రగిరిలో జనప్రవాహం ఉప్పొంగింది. పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో నయా జోష్ నెలకొంది. మండే ఎండను సైతం లెక్కచేయక అభిమాన జడిలో తడిసి ముద్దయ్యింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నామినేషన్ ప్రక్రియ అట్టహాసంగా సాగింది. నియోజకవర్గంలోని చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, తిరుపతి రూరల్ నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు పోటెత్తారు. భారీ క్రేన్లతో గజ మాలలు వేసి అభిమానాన్ని చాటుకున్నారు. డప్పు వాయిద్యాలు కార్యకర్తలను ఉర్రూతలూగించాయి. జై జగన్ నామస్మరణ మార్మోగింది. తొండవాడ, చెర్లోపల్లి, తుమ్మలగుంట, గాంధీపురం వద్ద ఆత్మీయ స్వాగతం లభించింది.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మోహిత్‌రెడ్డి కుటుంబ సమేతంగా గురువారం వేకువజామున తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామిని, చాముండేశ్వరి దేవి, చంద్రగిరి మూలస్థానమ్మ, చంద్రగిరి నాగాలమ్మ ఆలయాల్లో అమ్మవారి పాదాల చెంత నామినేషన్ పత్రాలు ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకు లు ఆశీర్వచనం అందజేశారు. తర్వాత అర్చకుల నుంచి నామినేషన్ పత్రాలను చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అందుకున్నారు. క్రైస్తవ మత పెద్దలు ఆశీర్వదించారు. అంతకుముందు తల్లిదండ్రులు చెవిరెడ్డి లక్ష్మి, భాస్కర్‌రెడ్డి ఆశీర్వాదం అందుకున్నారు. నానమ్మ విజయోస్తు మనవడా..! అంటూ దీవెనలందించారు.

భారీ ర్యాలీ

నాగాలమ్మ ఆలయం నుంచి భారీ ర్యాలీగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి బయలుదేరారు. చంద్రగిరి టవర్ క్లాక్ వద్దకు చేరుకుని భారీ బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. నిర్ణీత గడువులో తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అందజేశారు. నామినేషన్ ర్యాలీలో టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మంత్రి ఆర్కే రోజా, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి హాజరయ్యారు. వీరంతా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. మోహిత్ రెడ్డిని మీ బిడ్డగా ఆదరించి ఆశీర్వదించాలని కోరారు.

నా బలం, బలగం నియోజకవర్గ ప్రజలే

మోహిత్ మాట్లాడుతూ.. 'నా బలం, బలగం నా నియోజకవర్గ ప్రజలు.. మా పార్టీ నాయకులు, కార్యకర్తలు.. మీ బిడ్డగా ఆదరించి ఆశీర్వదించండి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవకు అంకితమవుతా'నని చెప్పారు. గమీకు జీవితకాలం రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా చంద్రగిరి నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధికి సంకల్పించామన్నారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి కరోనా కాలంలో, వరదల సమయంలో తన తండ్రి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తాను, కుటుంబ సభ్యులైన పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసిన విషయాన్ని గుర్తుచేశారు. చరిత్రలో నిలిచేలా నియోజవర్గంలో రూ.900 కోట్లతో అభివృద్ధిని పరుగులు పెట్టించామన్నారు. సీఎం జగనన్న ప్రభుత్వంలో రాష్ట్రంలో కేవలం సంక్షేమమే కాదు అభివృద్ధి కూడా అదే స్థాయిలో జరిగిందన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించండి

2014, 2019 ఎన్నికల్లో ప్రజా నాయకుడు, ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ఆశీర్వదించిన విధంగా 2024 ఎన్నికల్లో చరిత్రలో నిలిచేలా అత్యధిక మెజారిటీతో మోహిత్‌రెడ్డిని గెలిపించాలని ప్రముఖులు విజ్ఞప్తి చేశారు. రెట్టింపు ఉత్సాహంతో అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తాడన్నారు. పాలకుడిగా కాకుండా సేవకుడిగా మీకు అందుబాటులో ఉండే మోహిత్‌ను ఆదరించి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను కూడా అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.



నానమ్మతో కలిసి నామినేషన్ దాఖలు చేస్తున్న చెవిరెడ్డి మోహిత్

వెంకటగిరిలో ఫ్యాన్స్ ప్రభంజనం!

వెంకటగిరి (సైదాపురం): అభిమానం ఉప్పొంగింది. వెంకటగిరిలో జన ప్రభంజనం సృష్టించింది. తిరుపతి జిల్లా అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఆయన మొదట నేదురుమల్లి నివాసం నుంచి ప్రత్యేక వాహనంలో ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా దారిపొడవునా అభిమానులు పూలవర్షం కురిపించారు. డప్పు వాయిద్యాల మధ్య ర్యాలీ సాగింది. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఆయన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. తర్వాత రామ్‌కుమార్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తమ తల్లిదండ్రులైన నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, రాజ్యలక్ష్మి వెంకటగిరి పట్టణానికి 40 ఏళ్లుగా చేస్తున్న సేవలే తమను గెలిపిస్తాయన్నారు. మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం సృష్టించడం ఖాయమన్నారు.

సూళ్లూరుపేటలో జనసునామీ!

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణం ఇసుకేస్తే రాలనంతగా జనంతో నిండిపోయింది. వైఎస్సార్‌సీపీ స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య నామినేషన్ కార్యక్రమం అట్టహాసంగా సాగింది. మొదట ఆయన నాయుడుపేట పట్టణంలోని విజయగణపతి ఆలయం, పోలేరమ్మ ఆలయం, చిన్న దర్గా వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయుడుపేట నుంచి ర్యాలీగా సూళ్లూరుపేట బస్టాండ్‌కు చేరుకున్నారు. అక్కడ బస్టాండ్ సెంటర్ నుంచి నామినేషన్ కేంద్రం దాకా అశేష జనవాహిని మధ్య తన ప్రచార రథంపై ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఊరేగింపుగా నామినేషన్ కేంద్రానికి వెళ్లి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన స్థానిక విలేరులతో మాట్లాడుతూ జనాన్ని సంపాదించుకున్న జగనన్నకు ఓటమే లేదన్నారు. సూళ్లూరుపేట నియోజవర్గాన్ని రూ.1,600 కోట్లతో అభివృద్ధి చేసినట్టు తెలిపారు.





వెంకటగిరిలో ర్యాలీకి తరలివచ్చిన అభిమానులు (ఇన్‌సెట్) ఆర్‌ఓకు నామినేషన్ అందజేస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి





సూళ్లూరుపేట పట్టణంలో అశేష జనవాహినితో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య (ఇన్‌సెట్) నామినేషన్ పత్రం అందజేస్తున్న కిలివేటి

నిబంధనలు తప్పనిసరి

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనలను ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా పాటించాలని తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పోలీస్ అబ్జర్వర్ అరవింద్ సాల్వే తెలిపారు. గురువారం ఆయన తిరుపతి కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ సెంటర్‌తోపాటు నియోజకవర్గాల ముఖచిత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోజు వారీ పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మీడియా కమాండ్ కంట్రోల్ రూం, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూంలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మరోవైపు సీ–విజిల్ పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏదైనా ఎన్నికల సంబంధిత ఫిర్యాదులకు తన మొబైల్ నంబర్ 9154141876కు ఫోన్ ద్వారా లేదా తమ మెయిల్ పోలీస్ అబ్జర్వర్ టీపీటీ అట్‌ది రేటాప్ జీమెయిల్.కామ్ ద్వారా తెలియజేయాలని కోరారు. ఆయన వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు చంద్రశేఖర్, సంబంధిత నోడల్ అధికారులు దశరథ రామిరెడ్డి, సతీష్ తదితరులు ఉన్నారు.



ముఖచిత్రాలను పరిశీలిస్తున్న తిరుపతి పార్లమెంట్ పోలీస్ అబ్జర్వర్ అరవింద్ సాల్వే

క్లుప్తంగా

రూ.2వేల నోట్ల మార్పిడికి ఆమోదం?

తిరుమల : టీటీడీ వద్ద ఉన్న రద్దుచేసిన రూ.2వేల నోట్లను మార్పిడి చేసేందుకు భారత రిజర్వ్ బ్యాంక్ ఆమోదం తెలిపినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వం 2023 అక్టోబర్ 7వ తేదీ నుంచి రూ.2వేల నోట్ల మార్పిడిని రద్దుచేసిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత కూడా పలువురు భక్తులు స్వామివారికి హుండీలో రూ.2వేల నోట్లను సమర్పించారు. దీంతో టీటీడీ చేసేదిలేక రిజర్వ్ బ్యాంక్ అధికారులతో సంప్రదించి నోట్ల మార్పిడి చేయాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆర్బీఐ 2023 అక్టోబర్ 8 నుంచి 2024 మార్చి 22వ తేదీ వరకు ఐదు విడతల్లో రూ.3 కోట్ల 20లక్షల విలువచేసే రూ.2వేల నోట్లను మార్పిడి చేసినట్లు సమాచారం.

తాగుబోతుల వీరంగం

ఏర్పేడు: మండలంలోని కందాడు ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాత్రి తాగుబోతులు వీరంగం సృష్టించినట్లు హెచ్ఎం సుధీర్ తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో బీరువా బద్దలు కొట్టి అందులోని రికార్డులు చించేసినట్లు వెల్లడించారు. డస్కులు సైతం విరిసివేశారని తెలిపారు.

కులం..వరం!

- ఎస్సీ అంటూ ఎన్నికల బరి తిరుపతి ఎంపీ అభ్యర్థి
- విద్యార్హత ధ్రువపత్రాల్లో ఆది ఆంధ్ర క్రిస్టియన్‌గా నమోదు
- స్వగ్రామంలో కుల ధ్రువీకరణ పత్రం తీసుకోని బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్
- ఎక్కడ నివాసముంటే అక్కడే కుల ధ్రువీకరణ పత్రం
- నామినేషన్ల స్క్రూటీనీలో భాగోతం బయటపడేనా?

కులం ఆయనకువరంగా మారింది. ఆది ఆంధ్ర క్రిస్టియన్(బీసీ–సీ) అయిన ఆయన ఎస్సీ అంటూ తిరుపతి ఎంపీ ఎన్నికల బరిలో దిగడం చర్చనీయాంశమైంది. ఎక్కడ నివాసముంటే అక్కడ అధికారులను మేనేజ్ చేస్తూ కులధ్రువీకరణ పత్రాన్ని పుట్టించడం ఇప్పుడు జిల్లాలో హాట్‌టాఫిక్‌గా మారింది. ఆయన సమర్పించిన అఫిడవిట్‌లోనూ కులధ్రువీకరణకు నిరూపితమైన పత్రాలు సమర్పించకపోవడం గమనార్హం. ఆయన ఎవరు.. ఏంటో మీరే చదవండి!

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం గత కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా కొనసాగుతోంది. దీనిని అదునుగా తీసుకుని కొంతమంది ఆది ఆంధ్ర క్రిస్టియన్ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు ఎస్సీ అంటూ తప్పుడు ధ్రువపత్రాలను సృష్టించి ఎన్నికల బరిలో దిగుతున్నారు. ఇందులో భాగంగానే తిరుపతి ఎంపీ అభ్యర్థి వీ.వరప్రసాద్ గత ఎన్నికల్లో ఎస్సీ ధ్రువపత్రాలను పొంది ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగి విజయం సాధించారు. ఆయన ఆది ఆంధ్ర క్రిస్టియన్ (బీసీ–సీ) కేటగిరికి చెందిన వ్యక్తిగా విద్యార్హత సర్టిఫికెట్లలో నమోదైంది. కానీ తాను ఎస్సీ అంటూ ఎక్కడ నివాసముంటే అక్కడ వ్యవస్థలను, అధికారులను తనకు అనుకూలంగా మలచుకుంటూ ధ్రువపత్రాలను సృష్టించుకుంటున్నారు.

నిరూపిత ఆధారాలెక్కడ?



బీజేపీ తరపున బరిలో దిగుతున్న వరప్రసాద్ 2004, 2009, 2014లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వేసిన నామినేషన్ పత్రాలలో తన విద్యార్హత సరీఫికెట్లలో కుల నిరూపిత ఆధార పత్రాలను సమర్పించలేదు. ఇదే విషయాన్ని అప్పటి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దిగిన జయరాం ఆర్‌టీఐ ద్వారా సమాచారం తీసుకుని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గతంలో ఇదే విషయాన్ని సంబంధిత ఆర్‌డీఓ దృష్టికి, ఎలక్షన్ కమిషన్ దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఆయన ఈ విషయంపై హైకోర్టును ఆశ్రయించారు. ఫిర్యాదుపై ఐదేళ్లపాటు వాయిదాలతో విచారణ కొనసాగడం, ఎంపీ కాలవ్యవధి పూర్తవడంతో ఆ కేసును న్యాయస్థానం కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. అయితే ఎవరైనా అతని కుల ధ్రువీకరణపై అనుమానాలు ఉంటే ఎక్కడైనా ఫిర్యాదు చేయవచ్చని అప్పట్లో న్యాయస్థానం ప్రకటిస్తూ ఉత్తర్వులిచ్చింది. అనంతరం ఫిర్యాదు చేసిన అప్పటి బీజేపీ అభ్యర్థి జయరాం దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. దీంతో అప్పటి నుంచి ఆయన కుల ధ్రువీకరణ విషయం మరుగున పడింది.

అధికారులను మేనేజ్‌చేయడంలో దిట్ట

వీ.వరప్రసాద్ గతంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలో ఆయన ఎక్కడ నివాసముంటే అక్కడే కుల ధ్రువీకరణ పత్రాలను పుట్టించే వారు. అధికారంతో పాటు గతంలో సివిల్ సర్వెంట్‌గా పనిచేయడంతో రెవెన్యూ అధికారులపై తన ప్రతాపాన్ని చూపేవారు. తాను మాజీ ఐఎఎస్ అధికారిని, తనకు తెలియని రూల్స్ లేవు.. అంటూ రెవెన్యూ అధికారులను మ్యానేజ్ చేసి తనకు అనుకూలంగా మలచుకునేవారు. 2014లో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసిన సమయంలో, 2019లో గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన సమయంలోనూ ఎస్సీని అంటూ కుల ధ్రువీకరణ పత్రాన్ని గూడురు రెవెన్యూ కార్యాలయంలో తీసుకున్నారు. నామినేషన్ పత్రాలలో విద్యార్హత సర్టిఫికేట్‌లో నమోదైన కులాన్ని ప్రస్తావించకుండా అందుకు అవసరమైన ధ్రువపత్రాలను జతపరచకుండా జాగ్రత్త పడ్డారు.


తిరుపతి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి వరప్రసాద్

స్క్రూటినీలో భాగోతం బయటపడే అవకాశం

రేపటి నుంచి నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియ కొనసాగనుంది. గత కొన్ని ఏళ్లుగా వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ వస్తున్న వరప్రసాద్ భాగోతం ఎన్నికల కమిషన్ చేస్తున్న స్క్రూటినీ ప్రక్రియలో తేలనుంది. కుల ధ్రువీకరణపై ఆర్ఓ, జిల్లా ఎన్నికల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.

ట్రాక్టర్ బోల్తా

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న డ్రైవర్ మోహన్

చిల్లకూరు: మండలంలోని కడివేడు సమీపంలో గురువారం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన మోహన్ ట్రాక్టర్‌లో వరి పొట్టు లోడ్లు తీసుకుని నెల్లూరు నుంచి కోటకు వెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ చేసి తిరిగి నెల్లూరుకు బయలు దేరాడు. ఈ క్రమంలో కడివేడు రాజ్యలక్ష్మి గిరిజన కాలనీ దాటిన తర్వాత మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మోహన్ తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

జాగ్రత్తలే వడదెబ్బకు నివారణ

తిరుపతి(అలిపిరి): ప్రస్తుతం ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శ్రీహరి అన్నారు. గురువారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో స్టేషన్ రైల్వే రక్షణ దళం ఆధ్వర్యంలో వడదెబ్బ–తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అవగాహన సదస్సును నిర్వహించింది. శ్రీహరి మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రంగా నమోదవుతున్నాయని, ప్రయాణాలు, వృద్ధులు, పిల్లలు, రైల్వే కార్మికులు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని.. నీటిని ఎక్కువగా తాగాలని, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రయాణికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రైల్వే భద్రత దళం సిబ్బంది చలివేంద్రంలో చల్లని మంచినీరు, మజ్జిగ అందజేస్తాందని తెలిపారు. దీన్ని నిరంతరాయంగా కొనసాగించేందుకు దాతలు సహకరించాలని కోరారు. డీఎంవో డాక్టర్ రెహనా బేగం, రైల్వే భద్రత దళం సీఐ మధుసూదన్, ఎస్ఐ రాంబాబు, చెన్నప్పరెడ్డి, స్టేషన్ మేనేజర్, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు

నాయుడుపేట టౌన్: జిల్లాలో వైఎస్సార్‌సీపీ దూసుకుపోతోంది. ఈ క్రమంలో పలువురు కూటమి నేతలు పార్టీలో చేరుతున్నారు. ఇందులో భాగంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య సమక్షంలో నాయుడుపేట పట్టణానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆర్కాట్ వెంకటరత్నం, మొదలియార్ అతని అనుచరులతో కలసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ కరీంభాయి చెంచయ్య సారథ్యంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యతోపాటు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్ రెడ్డి, ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.


నాయుడుపేట : వెంకటరత్నంకు కండువా కప్పి స్వాగతిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య


శ్రీకాళహస్తి : పల్లంపేట సర్పంచ్‌కి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

పార్టీలోకి పల్లంపేట సర్పంచ్

శ్రీకాళహస్తి: మండలంలోని పల్లంపేట సర్పంచ్ సిమల గోపాల్‌యాదవ్ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన గురువారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ వారు తనను ప్రలోభపెట్టడం వల్లనే ఆ పార్టీలో చేరానని తెలిపారు. కార్యక్రమంలో ముత్తుకూరు శ్రీను, సుబ్రహ్మణ్యం, వెంకటయ్యయాదవ్, మునిశేఖర్, మునిరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 40 ముస్లిం కుటుంబాలు

చిల్లకూరు: మండలంలోని పారిచెర్లవారిపాళెం గ్రామానికి చెందిన 40 టీడీపీ ముస్లిం కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో భాగంగా గూడూరు ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ సమక్షంలో ముత్యాలమ్మ ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వరిదిరెడ్డి, రామోహన్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ఇస్మాయిల్‌బాషా, శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో చాన్‌బాషా, మస్తాన్, ఎస్‌కే సందానీ, బషీర్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు

- ఇంటర్‌లో మొదటి..టెన్త్‌లో నాలుగో స్థానం

తిరుపతి ఎడ్యుకేషన్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్ పరీక్ష ఫలితాలు గురువారం వెలువడ్డాయి. పదో తరగతి పరీక్షలకు 1,066 మంది హాజరు కాగా, 923(86.59శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ పరీక్షకు 2,540మంది హాజరు కాగా, 2,220(87.40శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. 26జిల్లాల ప్రాతిపదికన విడుదలైన పదో తరగతి ఫలితాల్లో తిరుపతి జిల్లా 4వ స్థానం, ఇంటర్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. పది, ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను www. apopenschool. apgov. in అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1నుంచి 8వ తేదీ వరకు రోజూ మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నిర్వహించనున్నారని తెలిపారు. ఆయా పరీక్షలకు సంబంధించి ఈనెల 29 నుంచి మే 4వ తేదీలోపు అపరాధ రుసుం లేకుండా, అపరాధ రుసుంతో మే 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చని డీఈఓ తెలిపారు.

ఆదిమూలంకు అసమ్మతి సెగ


టీడీపీ రెబల్ అభ్యర్థిగా జేడీ రాజశేఖర్


స్వతంత్ర అభ్యర్థిగా ఎన్ఆర్ఐ ప్రతినిధి రమేష్


నామినేషన్ వేస్తున్న హేమలత

- మూడుకు చేరిన రెబల్ అభ్యర్థుల నామినేషన్లు

వరదయ్యపాళెం: సత్యవేడు స్థానిక టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలంకు రెబల్ అభ్యర్థుల బెడద అధికమవుతోంది. ఇప్పటివరకు ఆ పార్టీకి సంబంధించిన మాజీ ఎమ్మెల్యే హేమలత, గత సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన జేడీ రాజశేఖర్, టీడీపీ ఎన్ఆర్ఐ విభాగానికి చెందిన విశాఖ నివాసి యతాటి రమేష్ వేర్వేరుగా నామినేషన్లు వేశారు. అయితే నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు మాత్రం తమకు అనుకూలమైన నాయకుడు వెంట వెళ్లేందుకు మార్గం సుగమం చేసుకుంటున్నారు. దీంతో నియోజకవర్గంలో టీడీపీకి చెందిన పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డారు. ఇటీవల ప్రజాగళం రోడ్ షోలో పాల్గొనేందుకు సత్యవేడుకు వచ్చిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీ రాజశేఖర్, హేమలతను హెలిప్యాడ్ వద్ద బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ ఆ ప్రయత్నం బెడిసి కొట్టింది. అధినేత వచ్చి వెళ్లిన తర్వాత కూడా వీరు రెబల్ అభ్యర్థులుగా నామినేషన్ వేయడమే అందుకు నిదర్శనం. దీంతో స్వయాన టీడీపీ పార్టీకి చెందిన ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు సత్యవేడులో టీడీపీ పని అయిపోయిందంటూ ప్రచారం చేస్తున్నారు. అభ్యర్థిగా ఉన్న ఆదిమూలం వెనుక నడిచేందుకు పలువురు పార్టీ శ్రేణులు ససేమిరా అంటున్నారు. ఎన్ఆర్ఐ రమేష్ వెంట కొందరు, జేడీ రాజశేఖర్ వెంట మరికొందరు, మాజీ ఎమ్మెల్యే హేమలత వెంట కొందరు ఇలా ఎవరికి వారు పార్టీ శ్రేణులు ఉన్నారు.

రేపు పాలిసెట్

- ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష
- తిరుపతిలో 8, గూడూరులో 6 పరీక్షా కేంద్రాలు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా నిర్వహించే పాలిసెట్ ప్రవేశ పరీక్షను ఈ నెల 27వ తేదీ ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్, తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఆ కళాశాలలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా పరిధిలో తిరుపతిలో 8, గూడూరులో 6, మొత్తం 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరుపతిలోని 8 కేంద్రాల్లో 3,972 మంది, గూడూరులోని 6 కేంద్రాల్లో 1,147మంది, మొత్తం 5,119 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రంలోకి ఉదయం 10 గంటల నుంచే విద్యార్థులను అనుమతిస్తామని, బ్యాగులు, పర్సులు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించమని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా ఒరిజినల్ హాల్‌టికెట్, ఆధార్, ఏదేని ఫొటో కలిగిన గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని ఆయన స్పష్టం చేశారు.

తిరుపతిలో పరీక్షా కేంద్రాలివే..

కేటీ రోడ్డులోని టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగా ఉన్న ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఎస్‌జీఎస్ ఉన్నత పాఠశాల, బాలాజీ కాలనీలోని శ్రీపద్మావతి బాలికల హైస్కూల్, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల బ్లాక్–ఏ, బ్లాక్–బీ, శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల, శ్రీపద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల బ్లాక్–ఏ, బ్లాక్–బీ.


పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ ద్వారకనాథరెడ్డి

గూడూరులో పరీక్షా కేంద్రాలు

తిలక్‌రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ సెరామిక్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలుర జెడ్పీ హైస్కూల్, బాలికల జెడ్పీ హైస్కూల్, డీఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాల.

టెన్త్ ప్రతిభావంతులకు అభినందన


టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం నుంచి జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులకు టీటీడీ పరిపాలన భవనంలో గురువారం ఈవో ఏవీ ధర్మారెడ్డి జ్ఞాపికలు అందించి అభినందించారు. 570కి పైగా మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులను ఈవోతో పాటు జేఈవోలు గౌతమి (విద్య–వైద్యం), వీరబ్రహ్మం, టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ భాస్కర్ రెడ్డి అభినందించారు. శ్రీకోదండరామస్వామి ఆంగ్ల ఉన్నత పాఠశాలలో ఆరుగురు, ఎస్వీ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు, శ్రీ పద్మావతి బాలికోన్నత పాఠశాల నుంచి నలుగురు, శ్రీ గోవిందరాజ స్వామి ఆంగ్ల ఉన్నత పాఠశాల, తిరుమల ఎస్వీ ఉన్నత పాఠశాల, శ్రీ కపిలేశ్వరస్వామి ఉన్నత పాఠశాల, ఎస్వీ ఓరియంటల్ ఉన్నత పాఠశాల, ఎస్వీ బధిర పాఠశాల, భీమవరంలోని ఎస్వీ బధిర పాఠశాల నుంచి ఒక్కొక్క విద్యార్థి చొప్పున మొత్తం 20 మంది విద్యార్థులు జ్ఞాపికలు అందుకున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్ని పాఠశాలల్లో 2023 -2024 విద్యా సంవత్సరం పది ఫలితాల్లో 98 శాతం, తిరుపతి ఎస్వీ బధిర పాఠశాల, భీమవరంలోని ఎస్వీ బధిర పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని టీటీడీ విద్యాశాఖాధికారి భాస్కర్ రెడ్డి తెలిపారు. పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

నేడు ఎన్ఎస్‌యూ స్నాతకోత్సవం

తిరుపతి సిటీ: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ 3వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ హాజరుకానున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. స్నాతకోత్సవంలో 67మందికి గోల్డ్‌మెడల్స్, 47మందికి పీహెచ్‌డీలు, 580 మందికి డిగ్రీ పట్టాలను అందజేయనున్నారు.

షార్ ఉద్యోగి ఆత్మహత్య

సూళ్లూరుపేట : సతీష్ ధవన్‌స్పేస్ సెంటర్ షార్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మేడబల్మి కోదండ గణేశ్వర్ (31) గురువారం సూళ్లూరుపేట పట్టణంలోని కేఆర్‌పీ కాలనీలో ఉరి వేసుకుని మృతి చెందినట్టు స్థానిక ఎస్ఐ కే.రహీంరెడ్డి తెలిపారు. మృతుడు కాకినాడ జిల్లా, తొండంగి మండలం, పైడికొండ గ్రామానికి వ్యక్తిని పేర్కొన్నారు. ఈ మేరకు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు.